సాక్షి
నల్లగొండ
సోమవారం । 19 । జూన్ । 2023



ముగిసిన ఐలు మహాసభలు
భువనగిరిలో జరుగుతున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. - IIలో



మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
తెలంగాణలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. - IIలో

గరిష్టం/కనిష్టం
39° / 29°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

నల్లగొండ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా యంత్రాంగం ఉత్సవాల నిర్వహణలో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషాయన్ని ఫిర్యాదు దారులు గమనించాల్సిందిగా కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టుల్లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాతత్వశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, సామాన్య శాస్త్ర బోధనా పద్ధతులు, గణిత శాస్త్ర బోధనా పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధనా పద్ధతులు, తెలుగు బాష బోధనా పద్ధతులు, ఆరోగ్య మరియు వ్యాయామ విద్య, దృశ్య కళలు మరియు కళా విద్య సబ్జెక్టులు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి బయోడేటా, జిరాక్స్ సర్టిఫికెట్లను నల్లగొండ డైట్ కళాశాలలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు డైట్ ప్రిన్సిపాల్ 9949993723 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి


నల్లగొండ టూటౌన్ : తొమ్మిదేళ్లగా మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి బీజేపీని బలోపేతం చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని, రైతులకు రుణమాఫీ అని దగా చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. నాయకులందరు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

293 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 293 దేవాలయాలు ధూప దీప నైవేద్య పథకం మంజూరైంది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 2022లో ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తులు కోరుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో 217, యాదాద్రి భువనగిరి జిల్లాలో 88, సూర్యాపేట జిల్లాలో 126 దేవాలయాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వాటిలో నల్లగొండ 127, యాదాద్రి భువనగిరి 65, సూర్యాపేట 101 దేవాలయాలకు ఈ పథకం మంజూరైంది. ఈ పథకం కింద ఆలయ ఖర్చులకు రూ.2 వేలు, అర్చకుడి గౌరవ వేతనం కింద రూ.4 వేలు ప్రతి నెలా ప్రభుత్వం నుంచి అందనుంది.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం 645 అడుగుల గరిష్టస్థాయికి చేరడంతో అధికారులు ఈనెల 5న ఒక క్రస్ట్ గేటును పైకెత్తి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో తగ్గకపోవడతో నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు 3వ నంబరు క్రస్ట్ గేటును అర అడుగు మేర పైకెత్తి ఉంచి 414 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టులో గరిష్ట నీటి మట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 643.90 (4.17 టీఎంసీలు) అడుగుల వద్ద ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ప్రాజెక్టు గేటు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

● చినుకు చింత..



వర్షాభావంతో పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో మునుగోడు మండలం జక్కలవారిగూడెంలో చేనుకు నీటి తడి పెడుతున్న రైతు



అదునుదాటిపోతోందని శాలిగౌరారం మండలం ఆకారంలో పొడి దుక్కిలోనే పత్తి విత్తనాలను పెడుతున్న మహిళా కూలీలు

పది నెలలుగా పైసలేవీ!

- రైతు వేదికలకు విడుదల కాని నిర్వహణ నిధులు
- ఏఈఓలపైన పడుతున్న భారం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



పానగల్‌లోని రైతువేదిక

నల్లగొండ అగ్రికల్చర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతోంది. రైతువేదికలో విద్యుత్ బిల్లులు, స్వీపర్, తాగునీటి సౌకర్యం, జిరాక్స్, పేపర్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కోసం ప్రతి నెల రూ.9 వేల చొప్పున వ్యవసాయ విస్తరణాధికారులకు(ఏఈఓ)చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రకటించిన తరువాత 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు గాను రూ.45 వేలు ఏఈఓలకు చెల్లించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంటే సుమారు 10 నెలల నుంచి నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో వేదికల నిర్వహణ భారంగా మారిందని పలువురు ఏఈఓలకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ మూలకూ సరిపోని నిధులు

రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న నిర్వహణ నిధులు నెలకు రూ.9 వేలు ఏ మూలకూ సరిపోవడం లేదు. గ్రామాల్లో స్వీపర్‌కు, తాగునీరు పెట్టినందుకు కనీసం నెలకు రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. కరెంటు బిల్లులు ప్రతి నెల రూ.1000 నుంచి రూ.1500 వరకు చెల్లించాల్సి వస్తోంది. జిరాక్స్‌లు, పేపర్ బిల్లులు, ఇంటర్నెట్ సౌకర్యం, మైక్ ఏర్పాటు, స్నాక్స్, టీలు కలిపి రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఏఈఓలు పేర్కొంటున్నారు. ప్రతి నెల తాము ప్రభుత్వం ఇచ్చిన నిధుల కంటే అదనంగా రూ.5 వేల వరకు భరించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఈ నెలలో నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికల్లో వివిధ శాఖలకు చెందిన సమావేశాలను నిర్వహించారు. అప్పుడు కూడా తమపై అదనపు భారం పడిందని ఏఈఓలు పేర్కొంటున్నారు. ఒక్కో క్లస్టర్‌కు 5 వేల ఎకరాల చొప్పున ఉండాల్సి ఉండగా కొన్ని క్లస్టర్లలో 16 వేల ఎకరాల వరకు భూములు ఉండడం వల్ల పనిభారం పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. కాలం చెల్లిన ట్యాబ్‌లు, ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో పంటల నమోదు సక్రమంగా చేయలేపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతు వేదికకల నిర్వహణ కోసం ఇచ్చే నిధులను కనీసం రూ.15 వేలకు పెంచి ప్రతి నెలా చెల్లించాలని, కొత్త ట్యాబ్‌లను అందజేయాలని పలువురు ఏఈఓలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధులు రాగానే చెల్లిస్తాం



“ రైతువేదికలకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేస్తాం. ఏఈఓలు రైతు వేదికల్లో విధిగా సమావేశాలను నిర్వహించిన రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి.

– వై.సుచరిత, డీఏఓ

140 క్లస్టర్లు..

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులకు వ్యవసాయ శాఖ అధికారులతో సాగు మెలుకవలు, ఇతర సాంకేతిక విధానాలను తెలియజేయడం కోసం ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నియమించింది. ఒక క్లస్టర్‌కు ఒకటి చొప్పున జిల్లాలో 140 క్లస్టర్‌లకు 140 రైతు వేదికలను నిర్మించింది. వాటి నిర్వహణ భాద్యతలను వ్యవసాయవిస్తరణాధికారులకు అప్పగించింది. ఇందులో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పాటు సైంటిస్టుతో ప్రతి శుక్రవారం సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. కానీ వాటి నిర్వహణకు నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌దే..



అవంతీపురం మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద మంచినీళ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి మంచినీరు అందించాలనే సంకల్పంతో రూ.44వేల కోట్లతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఈ పథకం ప్రారంభంలో తాను కూడా నమ్మలేదని కానీ సీఎం కేసీఆర్ పూర్తి చేసి ఇంటింటికి మంచినీరు అందించి సుసాధ్యం చేశారని చెప్పారు. ఈ పథకాన్ని కేంద్రం కాపీ కొట్టి హర్‌ఘర్ జల్ పేరిట అమలు చేస్తోందని చెప్పారు. రైతుబంధు పథకాన్ని కూడా కేంద్రం కాపీ కొట్టి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పేరిట అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో 390 మంచినీటి ట్యాంకులు నిర్మించి ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఆర్డీఓ చెన్నయ్య, మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈలు అన్వర్, సంపత్‌కుమార్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ ఛైర్మన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తులు



లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు



ఆలయ పరిసరాల్లో భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆదివారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతల నుంచి భక్తులు సాయంత్రం నుంచే దేవాలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమవాస్య సందర్భంగా దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ తదితరులు వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఆలయంలో ట్రైనీ ఎస్పీ శేషాద్రిని రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరుగకుండా ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- నల్లగొండ మండలం చిన్నసూరారం వరకు సాగిన పాదయాత్ర
- సంఘీభావం తెలిపిన ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే



సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు సంఘీభావం తెలుపుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే

నల్లగొండ, నల్లగొండ రూరల్ : వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం పానగల్ నుంచి నల్లగొండ మండలం పరిధిలోని ఖాజీరామారం స్టేజీ మీదుగా చందనపల్లి, పెద్ద సూరం, చిన్న సూరారం వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన రోడ్డు వెంట ప్రజలను పలుకరించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేదని, తాగేందుకు నీళ్లు రావడం లేదని, రుణమాఫీ కాలేదని పలువురు భట్టి దృష్టికి తీసుకొచ్చారు. చందనపల్లి సమీపంలో డంపింగ్ యార్డు కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఖాజీరామారం సర్పంచ్ మహ్మద్ షబ్బీర్ బాబా చెప్పారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేజీ టూ పీజీ వరకు ఉచిత నిర్బంధ ఆంగ్ల విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అవసరం లేని భవనాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో పెద్ద కార్యాలయాలు అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటిని కుదించి ఆ నిధులను విద్యా రంగానికి ఖర్చు చేస్తామన్నారు. రైతులకు రైతుబంధు ఇవ్వడంతోపాటు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో డిగ్రీలు, పీజులు చదివిన యువకులు ఇడ్లీ నడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీరు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చేందుకు రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉదయం ఆయన పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, పెరిక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రకు ఠాక్రే సంఘీభావం

పానగల్ నుంచి చందనపల్లికి పాదయాత్రగా వెళ్తున్న భట్టి విక్రమార్కకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సంఘీభావం తెలిపారు. చందనపల్లి గ్రామంలో లంచ్ బ్రేక్ సమయంలో ఠాక్రేతోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్‌చౌదరి, భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్య కలిసి పలు విషయాలపై చర్చించారు.



నల్లగొండ మండలం చందనపల్లి వద్ద సాగుతున్న భట్టి పాదయాత్ర

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

రామన్నపేట : రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామ శివారులో ఓ వ్యవసాయబావి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన ధరావత్ మహేందర్ పరిసర గ్రామాల్లో కొనుగోలు చేసిన సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను సిరిపురం గ్రామ శివారులోని కొండేటి నర్సిరెడ్డి వ్యవసాయ బావి వద్ద నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు రామన్నపేట పోలీసులు తనిఖీలు చేయగా పీడీఎస్ బియ్యం నిల్వలు వెలుగు చూశాయి.దొరికిన బియ్యంను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

గట్టుప్పల్‌లో విషాదం



విఘ్నేష్ (ఫైల్)

చండూరు(గట్టుప్పల్) : మేడ్చల్ మల్కాజిగిరిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన యువకుడు దుర్మరణం చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గట్టుప్పల్ గ్రామానికి చెందిన చెరుపల్లి మల్లికార్జున్ కుమారుడు విఘ్నేష్ (22) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. శనివారం సాయంత్రం కళాశాలలో నిర్వహించిన ఫెయిర్‌వెల్ పార్టీకి హాజరయ్యాడు. అనంతరం రాత్రి 8గంటల ప్రాంతంలో తను నివాసం ఉండే గదికి బైక్‌పై తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పడమా..? లేక గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఎవరూ గమనించకపోవడం, ఆలస్యంగా ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. విద్యార్థి మృతికి గ్రామస్తులు, స్నేహితులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రతిభకు ఉత్తమ పురస్కారం



లక్ష్మారెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రి

తిరుమలగిరి(సాగర్): తిరుమలగిరి మండలంలోని గిరిజన బాలుర వసతి గృహ 10వ విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, వసతి గృహ అధికారి లక్ష్మారెడ్డి ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. ఈయన ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా మొత్తంలో రెండు వసతి గృహాలనే ఎంపిక చేయగా అందులో తిరుమలగిరికి అవార్డు రావడం సంతోషకరమని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

ఏడు గోవులు పట్టివేత

చింతపల్లి : మల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్ వైపునకు తరలివెళ్తున్న మూడు వాహనాలను పోలీసులు తనిఖీ చేసి ఏడు గోవులను పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. మల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్‌వైపుకు ఆదివారం రాత్రి సమయంలో మూడు టాటా ఏస్ వాహనాల్లో ఏడు గోవులను తరలిస్తుండగా చింతపల్లి మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. ఏడు గోవులను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ గోశాలకు తరలించగా నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన ఐలు రాష్ట్ర మహా సభలు



హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్‌భూయాన్ దంపతులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, యాదాద్రి: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తృతీయ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. భువనగిరిలో శని, ఆదివారం రెండు రోజుల్లో నిర్వహించిన మహాసభల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ పాల్గొని న్యాయవాదులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 400 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, ఐలు ఆల్ ఇండియా కార్యదర్శి సురేంద్ర నాథ్ మహాసభలకు అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అనంతల శంకరయ్య, శైలజ ,ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎండి నాగర్, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి ఎం.డీ.ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, కేశవరెడ్డి, చిక్కుడు ప్రభాకర్, కుక్క దూగ సోమయ్య, గొట్టిపాముల బాబురావు, రావుల రవీందర్‌రెడ్డి, జూకంటి రవీందర్, మొగుళ్ల రాజిరెడ్డి, బొట్ల పరమేశ్వర్, చింతల సాయిబాబా, సీసీ శ్రీనివాస్, నిహాల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తులు హాజరు

ఐలు మహా సభలకు జిల్లా న్యాయమూర్తులు హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్ రావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతి దేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీ మోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి సుమలతలు హాజరయ్యారు.

పలు అంశాలపై తీర్మానాలు

మహాసభల సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని, మృతిచెందిన న్యాయవాదికి ఆరు లక్షల రూపాయలు చెల్లించాలని తీర్మానించారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలన్నారు. న్యాయవాదులకు జీవిత బీమా ,ఆరోగ్య కార్డులు జారీ చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కోర్టుల్లో పూర్తిస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కోర్టు భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. న్యాయాధికారుల, న్యాయశాఖ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని తీర్మానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ న్యాయవాదులకు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, బ్యాంకు, జీవిత బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని కోర్టుల్లో ఆ చట్టాలకు అనుగుణంగా పనిచేసేలా రెగ్యులర్ న్యాయాధికారులను నియమించాలని పలు తీర్మానాలు చేయగా ఏకగ్రీవంగా ఆమోదించారు.

అతిథులకు సన్మానం

ఐలు సభలకు హాజరైన అతిథులకు ప్రముఖ చిత్రకారుడు చంద్ర గీసిన భువనగిరి ఖిలా చరిత్ర పటాలను అతిథులకు అందజేశారు. మహా సభలను విజయవంతం చేసిన ప్రతినిధులకు ఆహ్వానం సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి వెంకట్‌రెడ్డి, ఎం.డీ. ఇస్మాయిల్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

అత్తింట్లోనే ఉండి చదువుకోమన్నందుకు..

- ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



త్రివేణి (ఫైల్)

మేళ్లచెరువు : అత్తింట్లోనే ఉండి చదువుకోవాలని తల్లి మందలించినందుకు ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని రేవూరు గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవూరు గ్రామానికి చెందిన కృష్ణవేణి, రామారావు దంపతుల కూతురు త్రివేణి (25)కి అనంతగిరి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. త్రివేణి ఇటీవల గ్రూప్–4 పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకుంది. పుట్టింట్లో ఉంటూ పరీక్షకు సన్నద్ధం అవుతానని భర్తను కోరగా శనివారం ఉదయం రేవూరులో దించి వెళ్లాడు. సాయంత్రం సమయంలో అత్తింట్లోనే ఉండి చదువుకోవచ్చు కదా ఇక్కడికి ఎందుకు వచ్చావంటూ కృష్ణవేణి కుమార్తెను మందలించింది. త్రివేణి అదే రోజు రాత్రి 10గంటల సమయంలో గదిలో చదువుకుంటుండగా తల్లి కృష్ణవేణి ఇంటి ఆరుబయట నిద్రపోయింది. తెల్లవారు జామున తల్లి లేచి చూడగా అప్పటికే త్రివేణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి సంవత్సరం వయసు గల కూతురు ఉంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. భర్త దగ్గరే ఉండి చదువుకోవాలని మందలించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ యాదవ్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి : కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. కప్రాయిపల్లి గ్రామానికి చెందిన కొంతం అంజయ్య(67)కు భార్య రంగమ్మ, ముగ్గురు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. అంజయ్య మండలంలోని జూలూరు గ్రామంలో బజ్జీల బండి నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం భార్యాభర్తలిద్దరు జూలూరు గ్రామానికి వచ్చారు. బజ్జీలతయారీకి అవసరమైన సామాను భార్యకు ఇచ్చి కడుపు నొప్పి వస్తుందని ఇంటికి వెళ్లాడు. అనంతరం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో చీరెతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. మధ్యాహ్నం భార్య రంగమ్మ ఇంటికి వచ్చి చూడగా అంజయ్య దూలానికి వేలాడుతూ కన్పించాడు. భయపడి ఇరుగుపొరుగు పిలవడంతో వారు వచ్చి అంజయ్యను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు మృతి



సక్కుబాయమ్మ(ఫైల్)

గరిడేపల్లి : మూడు రోజుల క్రితం అదృశ్యమైన వృద్ధురాలు విగతజీవిగా కనిపించింది. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని కోదండరామపురం శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ముత్తినేని సక్కుబాయమ్మ(70)కు కొంతకాలంగా మానసిక స్థితి సక్రమంగా లేదు. ఈ నెల 14న ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. రోజూ మాదిరిగానే ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఎల్‌బీ నగర్ వాసులకు కోదండాపురం శివారు ఏనెల వద్ద సక్కుబాయమ్మ విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమచారం ఇచ్చారు. దీంతో ఆమె కుమారుడు వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తన తల్లిదేనని గుర్తించాడు. సక్కుబాయమ్మ ఒంటిపై బంగారు ఆభరణాలు అలానే ఉండడంతో వడదెబ్బతో మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ పహారాలో అంత్యక్రియలు

మోత్కూరు : మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో ఆత్మహత్యకు పాల్పడిన బొడిగె లక్ష్మి (28) అంత్యక్రియలు ఆదివారం పోలీస్ పహారాలో నిర్వహించారు. భర్త బొడిగె శేఖర్‌తో వచ్చిన మనస్పర్ధలతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని భార్య లక్ష్మి శనివారం మృతిచెందిన విషయం విధితమే. మిర్యాలగూడకు చెందిన గనగాని పూలమ్మ కూతురు లక్ష్మిని పాలడుగు గ్రామానికి చెందిన బొడిగె యాదయ్య, ఎల్లమ్మ దంపతుల పెద్ద కుమారుడు శేఖర్‌కు ఇచ్చి గత సంవత్సరం డిసెంబర్‌లో వివాహం చేశారు. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం గ్రామానికి చేరుకున్న లక్ష్మి మృతదేహాన్ని చూసి మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఒక్క ఉదుటున వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతురాలి భర్త శేఖర్, అత్త, మామలు రెండు రోజులుగా పరారీలో ఉన్నారు. గ్రామ పెద్దలు, మృతురాలి పాలివారి సహకారంతో పోలీసులు లక్ష్మి మృతదేహానికి పోలీస్ పహారాలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశుసంపదను పెంచుకోవాలి



పశువులకు మందులు వేస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : పాడి రైతులు తమ పశుసంపదను పెంచుకోవాలని పశుగాభివృద్ధి సంస్థ ఉమ్మడి నల్లగొండ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కనుముకుల గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన నిర్వహించారు. అలాగే సంస్థ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం జరుగుతుందని, ఈ విధానం ద్వారా నాణ్యమైన మేలు జాతి దూడలు జన్మిస్తాయని చెప్పారు. ఆవులలో సెక్సడ్ సార్టెడ్ సెమన్ అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన గోపాలమిత్రలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, సర్పంచ్ కోట అంజిరెడ్డి, సూపర్‌వైజర్ గిరిబాబు, బాలరాజు, గోపాలమిత్రలు జగత్, నాంచారయ్య రాజు, కొమ్మన బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు



కాలిపోయిన బోరు మోటారు

కోదాడరూరల్ : వరికొయ్యలకు పెట్టిన నిప్పు అంటుకుని మామిడితోట, వ్యవసాయ బోర్లు, గడ్డిమోపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలంలోని అడ్లూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. అడ్లూరు శివారులో గుర్తుతెలియని వ్యక్తులు వరికోయ్యలకు నిప్పు పెట్టారు. గాలివాటానికి మంటలు వ్యాపించి గ్రామంలోకి వచ్చాయి. స్థానికులు గమనించి వెంటనే ఫైరింజన్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చి స్థానిక ట్యాంకర్‌తో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ లోపు దాదాపుగా 4 ఎకరాల్లో మామిడితోట, మూడు వ్యవసాయ బోర్లు, పలువురి రైతులకు చెందిన 500 గడ్డిమోపులకు మంటలు అంటుకొని తగలబడ్డాయి. గ్రామానికి చేరుకొన్న ఫైరింజన్ నాలుగుసార్లు నీటిని తీసుకొచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కాపుగల్లుకు చేరుకున్న ప్రజా సంఘాల బస్సు యాత్ర, నాయకులు

కోదాడరూరల్ : అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం రాత్రి మండలంలోని కాపుగల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న పోరాటంలో మక్క శ్రీను మృతికి నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలుగా కేటాయిస్తామని చెప్పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కారదర్శి ఆర్.వెంకటరాములు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వృత్తి సంఘాల రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ తదితరులు ఉన్నారు.

మహిళ పర్సు చోరీ

నార్కట్‌పల్లి : రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళ చేతుల్లోని పర్సును దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన నార్కట్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. నార్కట్‌పల్లిలోని నల్లగొండ రోడ్డులో ఉంటున్న గడ్డం లావణ్య తన పిల్లలతో కలసి సాయంత్రం బజారుకు వచ్చి కూరగాయలు తీసుకొని తిరిగి వెళ్తోంది. నల్లగొండ చౌరస్తా సమీపాన బైక్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ దగ్గరికి వచ్చి ఆమె చేతులో ఉన్న పర్సును లాక్కొని వెళ్లిపోయారు. ఆ సమయంలో మహిళ కింద పడిపోయింది. పర్సులో రూ.4000 నగదు, బంగారు చైన్స్, సెల్‌ఫోన్ ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఉత్తమ అవార్డుకు ఎంపిక

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవంలో భాగంగా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ముగ్గురు సిబ్బంది ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రిన్సిపాల్‌గా పి.జానకిదేవి, ఉత్తమ ఇన్‌చార్జిగా మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి బోల్ల శ్యామ్‌రాజ్, ఉత్తమ అధ్యాపకుడిగా టి.సుధాకర్‌ను ఎంపిక చేస్తూ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి ఈనెల 20న నల్లగొండలో జరిగే విద్యా దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేయనున్నారు.

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో మెరిసిన విద్యార్థులు



తల్లిదండ్రులు, సోదరుడితో శన్వితారెడ్డి



కుటుంబసభ్యులతో తనూజ్

మాడుగులపల్లి: ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫలితాల్లో నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు విద్యార్థిని శన్వితారెడ్డి సత్తా చాటింది. ఆలిండియా స్థాయిలో 228 ర్యాంకు సాధించింది. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధనే లక్ష్యంగా కష్టపడి చదివిన శన్విత.. కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేస్తోంది. కుమార్తెకు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు రావడంపై తల్లిదండ్రులూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల టీఎస్ ఎంసెట్ ఫలితాల్లోనూ శన్వితారెడ్డి రాష్ట్రస్థాయి 7ర్యాంకు సాధించింది. బాలిక విభాగంలో రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచింది. ఈనెల 4వ తేదీన రెండు షిఫ్టుల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించారు. దాదాపు లక్షా 80 వేల మంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 30 వేల మంది పోటీ పడ్డారు. తాజా ఫలితాలతోపాటు తుది ఆన్సర్ కీని సైతం ఐఐటీ గువాహటి విడుదల చేసింది. ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఇక జాయింట్ సీట్ అలకేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది.

ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్..

మిర్యాలగూడ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో దామరచర్ల రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ తనూజ్ ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా ఫస్ట్‌ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 240వ ర్యాంకు సాధించాడు. తమ కుమారుడు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించడం పట్ల తల్లిదండ్రులు శ్రీనివాస్, శాంతిలు హర్షం వ్యక్తంచేశారు. తండ్రి శ్రీనివాస్ దామరచర్ల మండలంలోని కొండ్రపోల్‌లో స్కూల్ టీచర్‌గా పనిచేస్తుండగా తల్లి శాంతి గృహిణి. తనూజ్ చిన్నప్పటి నుంచి చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచేవాడని, పదవ తరగతిలో 10జీపీఏ, ఇంటర్మీడియట్‌లో 974 మార్కులు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఎస్టీ కేటగిరీలో 196వ ర్యాంకు..



రమావత్ శివాజీ

పెద్దవూర: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పెద్దవూర మండలంలోని పొట్టివానితండాకు చెందిన రమావత్ శివాజీకి ఎస్టీ కేటగిరీలో 196వ ర్యాంకు సాధించాడు.తండాకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన రమావత్ నాగ–సునీత దంపతుల కుమారుడు శివాజీ చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. తల్లిదండ్రులు ఇద్దరూ గ్రామాల్లో తిరుగుతూ సీజనల్‌గా వచ్చే పండ్లను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతని చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగింది. ఒకటి నుంచి 5 వరకు తండాలోని ప్రాథమిక పాఠశాలలోనూ, ఆరు నుంచి 10వ తరగతి వరకు పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లోనూ సాగింది. పదవ తరగతిలో 9.7జీపీఏ సాధించాడు. ఇంటర్మీడియట్ మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల కళాశాలలో చదివి 861 మార్కులు సాధించాడు. శివాజీని కుటుంబ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మోతె : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండలం కేశవాపురం గ్రామానికి చెందిన గుండెపంగు నాగమ్మ కూతురైన మౌనిక(28)కు 14 సంవత్సరాల క్రితం కోదాడకు చెందిన నాగరాజుతో వివాహం జరిగింది. అనంతరం దంపతులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. కొన్ని రోజుల తర్వాత దంపతుల మధ్య గొడవలు జరగడంతో మౌనిక తన ముగ్గురు పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. శనివారం సాయంత్రం మౌనిక మామిళ్లగూడెం చెర్వుకట్టపై స్థానికులకు కనిపించింది. తెల్లవారెసరికి చెర్వులో విగతజీవిగా స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మోతె ఎస్ఐ మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీయించారు. మృతదేహానికి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కూతురు భర్త నాగరాజు, అతడి తల్లిదండ్రులే హత్య చేసి ఉంటారని అనుమానంతో మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో బోధి ధర్మ యోగా అండ్ హెల్త్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవ కరపత్రాలను ఆదివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు సీత భాస్కర్, శిక్షకురాలు కొయ్యడ సంధ్య, నాయకులు చిల్వేరు బాలనర్సింహ, చింతకింది కిరణ్, దోర్నాల రత్నం, కొయ్యడ లింగస్వామి పాల్గొన్నారు.

గేదెలు మృతి

నాగారం : గుర్తుతెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి ఫణిగిరిలో చోటు చేసుకుంది. ఫణిగిరికి చెందిన సుభాష్‌రెడ్డికి చెందిన మూడు గేదెలు, యాదవరెడ్డికి చెందిన గేదె నాగారం వైపు నుంచి ఫణిగిరికి వెళ్తున్నాయి. తిరుమలగిరి నుంచి సూర్యాపేట వైపు వెళ్లే గుర్తు తెలియని లారీ ఢీకొని మూడు గేదెలు మృతి చెందగా మరో గేదెకు కాలు విరిగింది.

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మూడో సారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఆలేరు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు బోడ మహేష్‌కుర్మ, పట్టణ కార్యదర్శి మహ్మద్ సోనూ, నాయకులు తౌరారపు అరుణ, ప్రశాంత్ రెడ్డి, నర్సింహారెడ్డిలతో పాటు 300 మంది ఆ పార్టీ కార్యకర్తలు, మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోందన్నారు. బీజేపీ డిపాజిట్లు కాపాడుకునేందుకు యత్నిస్తుందని విమర్శించారు. తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని యావత్ ప్రజలు, యువకులు, మహిళలు కోరుకుంటున్నారని అన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డమీది రవీందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, ఆడేపు బాలస్వామి, పత్తి వెంకటేష్, మొరిగాడి వెంకటేష్‌గౌడ్, రియాజ్, షాబుద్దీన్, పూల శ్రావణ్, ముదిగొండ శ్రీకాంత్, పంతం కృష్ణ, దాసి సంతోష్, కందుల శ్రీకాంత్ తదితరులున్నారు.